క్లుప్తంగా

రూ.10 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం



బ్రిడ్జి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి

కదిరి అర్బన్: చిప్పలమడుగు, రొద్దంవారి పల్లికి వెళ్లే రహదారిలో మద్దిలేరు వాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉందని చిప్పలమడుగు, రొద్దంవారిపల్లి, నాగూరువారిపల్లి గ్రామస్తులు ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే.. బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సుభద్ర

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సుభద్ర కుటుంబ కలహాలతో వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుభద్ర ఆమె కుమారుడు శ్రీహరితో కుటుంబ సభ్యులు గొడవపడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన సుభద్ర వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతాప్

కదిరి అర్బన్: మండల పరిధిలోని ఆలంపూర్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల తెలిపిన వివరాలు.. నల్లచెరువు మండలానికి చెందిన నాగభూషణ, కదిరి మండలం సున్నపుగుట్ట తండాకు చెందిన ప్రతాప్.. వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో పులివెందులకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆలంపూర్ వద్ద వెనుకనుంచి ఓ గుర్తు తెలియని వాహనం.. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన నాగభూషణ, ప్రతాప్‌ను చికిత్సం స్థానికులు ఆటోలో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. రూరల్ మండల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోరాటయోధుడు 'గద్దర్'



మాట్లాడుతున్న చంద్ర

కదిరి: గద్దర్ అంటేనే ఒక విప్లవం.. అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో శుక్రవారం గద్దర్ అభిమాన సంఘం వారు ఏర్పాటు చేసిన గద్దర్ సంస్మరణ సభకు పలువురు విప్లవ కారులు, ప్రజా సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. దశాబ్దాల పాటు ఉద్యమ పాటలతో ప్రజలను చైతన్య పరచిన గద్దర్ చిరకాలం గుర్తుండి పోతారని తెలిపారు. గద్దర్ కదిరికి విచ్చేసి దివంగత కామ్రేడ్ రవూఫ్‌తో కలిసి అప్పట్లో పాడిన పాటలను కొందరు గుర్తు చేశారు. గద్దర్ విప్లవానికి ఊపిరి నిచ్చి.. ఉద్యమానికి ఊపు తెచ్చారని పేర్కొన్నారు. అంతకుముందు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విప్లవోద్యమ నాయకుడు బండారు గంగాధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిక్కీ రాయలసీమ కో-ఆర్డినేటర్ కోలా వెంకట రమణ, విప్లవ కళాకారులు ప్రసాద్, చంద్ర, ఇలియాజ్, బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గోవిందు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఇషాక్, జర్నలిస్ట్ సంఘం నాయకులు ప్రసాద్, మాజీ కౌన్సిలర్ చంద్ర పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



నల్లమాడ: మండలంలోని పులగంపల్లి సమీపంలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. వివరాలు.. రైతు గంగాధర మేత కోసం ఆవును గ్రామ సమీపంలోని పొలానికి తీసుకెళ్లాడు. అప్పటికే కిందపడి ఉన్న 11 కేవీ విద్యుత్ తీగ ప్రమాదవశాత్తూ ఆవుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.60 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

డ్వాక్రా మహిళల జీవితాల్లో వెలుగులు



బత్తలపల్లి: మండల సమాఖ్య ప్రతినిధులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ



కదిరి టౌన్: మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బత్తలపల్లి: డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, ఎంపీడీఓ సౌజన్యకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఏపీఎం సుదర్శన్‌రాజు అధ్యక్షత వహించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామంటూ మోసం చేశారన్నారు. ఎవ్వరూ బ్యాంకులకు కంతులు చెల్లించాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ సంగతి మరిచిపోయారని గుర్తు చేశారు. దీంతో రాష్ట్రంలో పొదుపు సంఘాల వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలిపోయిందన్నారు. అప్పటి వరకు సక్రమంగా కంతులు చెల్లించిన వారు ఒక్కసారిగా డీఫాల్టర్లుగా మారిపోయారన్నారు. అలా టీడీపీ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందన్నారు. అదే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు పెద్ద ఎత్తున తోడ్పాటునందిస్తున్నారన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించి అప్పటి నుంచి క్రమం తప్పకుండా వడ్డీ జమ చేస్తున్నారని తెలిపారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీ వర్తింపజేస్తున్నారని కొనియాడారు. వడ్డీ మొత్తాన్ని నేరుగా స్వయం సహాయక సంఘాల అప్పు ఖాతాల్లో జమ చేస్తున్నారని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 806 సంఘాల్లోని 8,567 మంది సభ్యులకు రూ.1,21,85,744 మంజూరైనట్లు వెల్లడించారు. అనంతరం డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందజేశారు. జెడ్పీటీసీ, ఎంపీపీలను మండల సమాఖ్య సభ్యులు శాలువాలు కప్పి సన్మానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో భారతి మండల సమాఖ్య కార్యదర్శి ఈశ్వరమ్మ, ఉపాధ్యక్షురాలు సుజాత, ఎల్‌సీ లక్ష్మీనారాయణ, సీసీలు సుధాకర్, వెంకటసత్యం, నాగానంద్, శంకర్, ఎంఎస్‌ఏ, వీఓ, ఎస్‌హెచ్‌జీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ కౌన్సిలర్ కె.ఎస్.దిల్షాదున్నీసా అన్నారు. శుక్రవారం పట్టణంలోని 10వ వార్డు సచివాలయ పరిధిలోని 33 మహిళ స్వయం సహాయక గ్రూపులతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా నాలుగో విడతలో 330 మందికి రూ.4,19,611 మంజూరైనట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు సీఎం జగన్‌కు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బహద్దీన్ సూచించారు. 2024లో మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 6న కృష్ణాష్టమి వేడుకలు



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: పట్టణంలో కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించే తెలుగు బుక్ ఆఫ్ రికార్డు కార్యక్రమాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తన నివాసంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 810 మంది చిన్ని కృష్ణులతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనుండటం హర్షణీయమన్నారు. మానస నృత్య కళా కేంద్రం నిర్వాహకురాలు మానస మాట్లాడుతూ.. సెప్టెంబర్ 6వ తేదీ సాయంత్రం 5 గంటలకు కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తామన్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు వారి ఆధ్వర్యంలో 810 మంది చిన్ని కృష్ణులు ఈ వేడుకల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లను ఈనెల 20వ తేదీలోపు నమోదు చేసుకోవాలని తెలిపారు.

విత్తన శుద్ధితో అధిక లాభాలు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

పుట్టపర్తి టౌన్: రైతులందరూ 14 వారాల పాటు సమగ్ర యజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని ఏఓ నట్రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి గ్రామంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. విత్తన శుద్ధి బాగా చేసుకుని, నాణ్యమైన విత్తనాలను వాడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అలివేలమ్మ, ఏఈఓ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోండి

చెన్నేకొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ ఉదయ్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్నారన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం సెల్‌ఫోన్ తీసుకెళ్లాలన్నారు.

గుంతలోకి దూసుకెళ్లిన టిప్పర్

తలుపుల: మండలంలోని పెద్దన్నవారిపల్లి పంచాయతీలోని వడ్డిపల్లి రోడ్డు వద్ద ఓ టిప్పర్ అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. కదిరి నుంచి 39 టీఎమ్ 7838 నంబర్ గల టిప్పర్‌లో డ్రైవర్ మధుసూదన్ ఇసుక కోసం గండి ఇసుక రీచ్‌కు బయలుదేరాడు. వడ్డిపల్లి రోడ్డు వద్దకు చేరుకోగానే టిప్పర్‌కు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో టిప్పర్.. రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్ కిందపడటంతో స్పృహ కోల్పోయాడు. స్వల్పంగా గాయపడిన అతడ్ని వైద్య చికిత్సల కోసం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రాలిపోతున్న చీనీ పూత



రసాయన మందు పిచికారీ చేయడంతో నల్లగా మారిపోయిన చీనీ పూత

తాడిమర్రి: కునుకుంట్ల గ్రామం వద్ద చీనీ చెట్లకు పూత అధికంగా వచ్చేందుకు ఓ రసాయన మందు పిచికారీ చేయడంతో పూత మొత్తం రాలిపోయింది. వివరాలు.. రైతు రామలింగారెడ్డి తనకున్న మూడు ఎకరాల పొలంలో 12 ఏళ్ల క్రితం 500 చీనీ మొక్కలు సాగు చేశాడు. ఇటీవల చీనీ చెట్లు పూతకు రావడంతో చెట్లు ఇగుర్లు బాగా రావాలని రసాయన మందు పిచికారీ చేయాలనుకున్నాడు. దీంతో అనంతపురంలోని శ్రీ చైతన్య ఫర్టిలైజర్స్‌లో ప్రొఫినో ఫాస్ లీటర్ రూ.750 సారాస్ లీటర్ రూ.600 చెల్లించి కొనుగోలు చేశాడు. ఈనెల 8న చీనీ చెట్లకు ఆ రసాయన మందులు పిచికారీ చేశాడు. మరుసటి రోజు తోట వద్దకు వెళ్లిన రైతు తోటను చూసి ఖంగుతిన్నాడు. తోటలో చీనీ చెట్ల పూత నల్లగా వాడిపోయి రాలిపోయింది. శ్రీచైతన్య ఫర్టిలైజర్‌లో తెచ్చిన మందుల వల్లే పూత మొత్తం రాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఫర్టిలైజర్ దుకాణదారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

80 శాతం సబ్సిడీతో ఉలవలు

అమడగూరు: ఖరీఫ్‌లో సాగు చేసుకునేందుకు రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ఉలవలను ఇస్తున్నట్లు ఓడిచెరువు ఏఓ ఇలియాజ్ మహమ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో ఆశించినంత వర్షాలు కురవక పోవడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలన్నారు.
ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ముందుగా పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.

నామినేషన్ల పరిశీలన

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డు స్థానానికి ఉప ఎన్నిక జరుగుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర్, ఎంపీడీఓ సౌజన్యకుమారి తదితరులు దాఖలైన నామినేషన్లను పరిశీలించారు. ఈ స్థానానికి లక్ష్మీనారాయణమ్మ, నారాయణమ్మ నామినేషన్లు వేశారు. రెండు నామినేషన్లు సక్రమంగానే ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. అనంతరం తుది జాబితా ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, కంచనగారి రాజశేఖర్‌రెడ్డి, ముసలప్ప, ప్రతాప్‌రెడ్డి, వెంకటేష్, సురేంద్రనాయుడు, నాగభూషణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



అధికారులను నిలదీస్తున్న సర్పంచులు

కనగానపల్లి: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించాలని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. ఇక వివిధ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ సరఫరా లోపాలు, లోవోల్టేజీ సమస్యలతో గ్రామాల్లో మంచినీటి పథకాలకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వేపకుంట, బద్దలాపురం, ముక్తాపురం, మామిళ్లపల్లి గ్రామాల సర్పంచులు విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీరు జునాద్‌ను నిలదీశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అలివేలమ్మ, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో దానిమ్మలో అధిక దిగుబడులు

- ధర్మవరం డివిజన్ ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి



దానిమ్మ పంటను పరిశీలిస్తున్న ధర్మవరం డివిజన్ ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి

ధర్మవరం రూరల్: దానిమ్మ తోటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ధర్మవరం డివిజన్ ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె గొట్లూరు సమీపంలో సాగు చేసిన దానిమ్మ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లాలో 2,400 హెక్టార్లలో దానిమ్మ సాగులో ఉందన్నారు. అదే విధంగా ధర్మవరం నియోజకవర్గంలో సుమారు 770 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు దానిమ్మ సాగు చేసినట్లు వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దానిమ్మకు బ్యాక్టీరియా (నల్లమచ్చ) సోకిందన్నారు. ప్రస్తుతం పూత దశ నుంచి పిందె దశలో ఉన్న తోటల్లో బ్యాక్టీరియా సోకే అవకాశం ఉన్నందున రైతులు యాజమాన్య పద్ధతులను పాటిస్తే తెగులు ఉధృతి నుంచి తోటలను కాపాడుకోవచ్చన్నారు. బ్యాక్టీరియా సోకిన కాయలను ఎప్పటికప్పుడు తొలగించి తోట బయట కాల్చి వేయాలని సూచించారు. రోగము సోకిన కొమ్మలను 2 ఇంచులు కిందకు కత్తిరించి కాల్చి వేయాలని తెలిపారు. కాయలు, కొమ్మలు తీసివేసిన తర్వాత 1 శాతం బోర్డో మిశ్రమం పిచికారీ చేయాలని పేర్కొన్నారు. 15 రోజుల తర్వాత రెండో సారి పిచికారీ చేయాలన్నారు. గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు తెగులు వ్యాప్తి జరుగకుండా జీవ శిలీంద్రనాశిని సూడోమోనాస్ 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. డ్రిప్ ద్వారా నీరు రోజు విడిచి రోజు గంటన్నరకు మించి ఇవ్వరాదన్నారు. నత్రజని సంబంధిత ఎరువులు వాడకం తగ్గించి వేప చెక్క గానుక చెక్క వంటివి చెట్లకు 2 కిలోల చొప్పున వేయాలని సూచించారు.

డ్రగ్స్ వాడటం చట్టరీత్యా నేరం



పోస్టర్ విడుదల చేస్తున్న సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

ధర్మవరం అర్బన్: డ్రగ్స్ వాడటం వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. పట్టణంలోని గుట్టకిందపల్లిలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం సెబ్ అధికారుల ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడటం చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్ వాడితే అనారోగ్యానికి గురై చివరికి ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతో పాటు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించాలన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం సలహాలు, ఫిర్యాదులు చేయాలనుకుంటే సెబ్ టోల్ ఫ్రీ నంబర్ 14500కు సంప్రదించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సెబ్ అధికారులు పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిశేషయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

ధర్మవరం అర్బన్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా ఆఫీసర్ కుళ్లాయప్ప నాయక్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వార్డు సచివాలయ కార్యదర్శులు, అర్బన్ హెల్త్ డాక్టర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధుల నివారణ పద్ధతులను ప్రజలకు తెలియజేయాలన్నారు. దోమల నియంత్రణకు సూచనలు ఇవ్వాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఇళ్లలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయరాం నాయక్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహబూబ్‌బాషా, శ్యామ్సన్, కేశవ, మేస్త్రీలు, అర్బన్ హెల్త్ డాక్టర్లు జగదీష్, శ్రావణి, సురేష్‌నాయక్, గౌతమి, చంద్రిక, ప్రియాంక, శ్వేత పాల్గొన్నారు.

యువతుల అదృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు గ్రామానికి చెందిన జగతి అనే యువతి అదృశ్యమైనట్లు శుక్రవారం తండ్రి నరేంద్రబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే ముదిగుబ్బకు చెందిన ఓ మైనర్ బాలిక ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయింది. ఇద్దరి మిస్సింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్లీనరీ జయప్రదం చేయాలి

కదిరి అర్బన్: పట్టణంలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగే భారత విద్యార్థి ఫెడరేషన్ 5వ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జాన్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అమడగూరు: మహమ్మదాబాద్ క్రాస్‌కు చెందిన వెంకటరమణ శుక్రవారం అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తీసుకెళ్తుండగా సెబ్ సీఐ సైదులు పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్‌ఐ గోపి పేర్కొన్నారు.

33 రకాల గులాబీలతో వాసవీమాతకు పూజలు



పూజలందుకున్న వాసవీమాత

ముదిగుబ్బ: మండల కేంద్రంలో వాసవి కన్యకాపరమేశ్వరికి అధిక మాసం సందర్భంగా శుక్రవారం ఆర్యవైశ్య మహిళలు 33 రకాల గులాబీ పూలు, 33 రకాల హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు క్రిష్టం సూర్యనారాయణ, జయశ్రీ, సునీత,భాగ్యరేఖ, యశోద, కనక, మాధవి, శ్రీవల్లి, వాసవి, ఉష, సంగీత, రాధ, గీత, ప్రవల్లిక, యువజన సంఘం నాయకులు మహేష్ కుమార్, రత్నం, శ్రీధర్, గంగాధర్, శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నచెరువు పరిశీలన

తనకల్లు: మండల పరిధిలోని ఒడ్డుమరవపల్లి చిన్నచెరువులో ఇటీవల విషప్రయోగంతో చేపలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ముత్యాలచెరువు ఫిషరీస్ అసిస్టెంట్ సుమియాబాను చిన్నచెరువును పరిశీలించారు. చేపలు ఏ విధంగా చనిపోయాయని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కాగా చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విషద్రావకాన్ని కలపడం వల్ల పెద్ద ఎత్తున చేపలు మృతి చెందిన ఘటనపై గ్రామ కార్యదర్శి చంద్రనాయక్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే చిన్నచెరువులో పశువులు నీటిని తాగకుండా చూసుకోవాలని గ్రామంలో చాటింపు వేయించారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



బత్తలపల్లి: మొక్కలు నాటుతున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి



కునుకుంట్లలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ గోవిందరెడ్డి

బత్తలపల్లి: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి అన్నారు. శుక్రవారం మండలంలోని అప్పరాచెరువు, మాల్యవంతం పంచాయతీల్లోని సచివాలయాలు, పాఠశాలల్లో నా భూమి-నా దేశం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. అమరవీరులను స్మరిస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జాతీయ జెండాను ఎగురవేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొర్రెడ్డిగారి శారదమ్మ, ఈఓఆర్డీ దివాకర్, ఏపీఓ ఆదెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి, కోనారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటేష్, హెచ్‌ఎం చెన్నకృష్ణారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ అనురాధ, హేమావతి, ఫీల్డ్ అసిస్టెంట్ బాలనరసింహులు, సూరి తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: కునుకుంట్ల, రామాపురం, చిల్లవారిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు నా భూమి-నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కునుకుంట్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎంఈఓ కృష్ణమోహన్ అధ్యక్షతన త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేశారు. స్వాతంత్ర్య సమర యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచులు లావణ్య, పుల్లయ్య, పెద్దశివారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పెద్దన్న, ఎంఈఓ కృష్ణమోహన్, సెకండ్ ఎంఈఓ వెంకటేష్, ఈఓపీఆర్డీ కామాక్షి, ఏపీఓ సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ వడ్డి గోపాల్‌రెడ్డి, నాయకులు వడ్డి లింగారెడ్డి, పరమేశ్వర్‌రెడి పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల పరిధిలోని ముక్తాపురంలో శుక్రవారం నా భూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా అధికారులు మొక్కలు నాటారు. పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఖాదర్‌భాషా, ఏపీఎం హేమలత, ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మొక్కల పెంపకం అందరి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని జెడ్పీటీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఓబుళంపల్లి, బసంపల్లి, గ్రామాల్లో నా భూమి - నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఓబుళంపల్లి, బసంపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు డోలా రామచంద్రా రెడ్డి, సర్పంచులు చన్నారెడ్డి, నారాయణ స్వామి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: మొక్కలను నాటి సంరక్షించాలని పుట్టపర్తి ఎంఈఓ ప్రసాద్, గ్రీన్ భారత్ ఫౌండేషన్ చైర్మన్ శంకరనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అమగొండపాళ్యం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలసి 52 మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ, వెంగమనాయుడు, ఫారెస్ట్ గార్డు మహదేవప్ప, వెంకటరత్నం పాల్గొన్నారు.

జాతీయ నాయకుల ఫొటోలు వితరణ

పుట్టపర్తిటౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ వారు శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి మండల పరిషత్ పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రపటాలను బహూకరించారు. అలాగే విద్యార్థులకు విద్యా సామగ్రి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు షామీర్, చాంద్, అల్లాబకాష్, ప్రాధానోపాధ్యాయురాలు అస్మ, ఉపాధ్యాయులు ఉషారాణి, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.